బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

● ఎస్పీ శరత్‌చంద్ర పవార్

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, అక్టోబర్ 14 : పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో ఆయన పాల్గొని బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సుమారు 25 ఫిర్యాదులు రాగా వాటిని సంబంధిత పోలీస్ షేషన్లకు బదిలీ చేశారు. బాధితుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.

గుర్రంపోడు పోలీస్‌స్టేషన్ తనిఖీ

గుర్రంపోడ్ : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ శరత్ చంద్ర పవార్ సోమవారం తనిఖీ చేశారు. రికార్డ్‌లను పరిశీలించారు. ఆదివారం మండల కేంద్రంలోని వైన్స్‌లో జరిగిన చోరీకి సంబంధించిన వివరాలను ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు దారులతో గౌరవంగా మాట్లాడాలని, ప్రతిరోజు పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్‌గౌడ్ ఉన్నారు.

ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్

కళాశాల బంద్ చేసి నిరసన తెలుపుతున్న యజమానులు

మిర్యాలగూడటౌన్, అక్టోబర్ 14: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలను నిరవధికంగా బంద్ చేస్తున్నట్లు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం ఉమ్మడి జిల్లా వైస్ ప్రెసిడెంట్ మెండు వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని హాసిత కళాశాలను బంద్ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలల నిర్వహణ కష్టతరమవుతుందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యనందించాలనే ఉద్దేశంతో అనేక వ్యయ ప్రయాసాల కోర్చి కళాశాలలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడేండ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. అందుకే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసేంత వరకు కళాశాలలు బంద్ చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని విజేత, హాసిత, శాంతినికేతన్, చైతన్య డిగ్రీ కళాశాలు బంద్ చేయగా ఆయా కళాశాలల విద్యార్థులు సైతం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెడ్ల ధనుంజయ, కోల శ్రీను, శ్రీనాథ్, వర ప్రసాద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా

● మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

రవీందర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులరిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

మునుగోడు, అక్టోబర్ 14 : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండలం కొరటికల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మామిళ్ల రవీందర్‌రెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. సోమవారం గ్రామానికి వెళ్లి కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శించారు. రవీందర్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ నాయకులు పొలగోని సైదులుగౌడ్, అయితగోని విజయ్‌గౌడ్, దోటి కరుణాకర్, ఐతగోని శేఖర్, ఎల్లంకి యాదయ్య, మిర్యాల బీరప్ప, కనకయ్య, బేరి గురుపాదం, శిర్గమల్ల నరిసింహ, ఐతగోని వెంకన్న, మాదిరెడ్డి రమేశ్‌రెడ్డి, శిర్గమల్ల అంజయ్య, చెన్నగోని శేఖర్ పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

దేవీ నవరాత్రి ముగింపు వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ

మిర్యాలగూడటౌన్, అక్టోబర్ 14: పట్టణంలో శాంతినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహానికి సోమవారం ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవీనవరాత్రి ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు పందిరి వేణు, కొమ్మన పట్టాభిరామ్, తీరంశెట్టి కోటేశ్వర్‌రావు, పొదిల వెంకన్న, ఆలయ కమిటీ సభ్యులు నరసయ్య, శ్రీను, యాదగిరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

అనంతాచారి కుటుంబానికి పరామర్శ

మిర్యాలగూడ : పట్టణంలోని శాంతినగర్ 26వ వార్డుకు చెందిన అనంతాచారి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ సోమవారం అనంతాచారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు చిట్టిపోలు వెంకటేశ్వర్లు, తిరంశెట్టి కోటేశ్వర్‌రావు, కుమార్ ఉన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగించిన వారికి జరిమానా

మిర్యాలగూడటౌన్, అక్టోబర్14: మిర్యాలగూడను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ యూసుఫ్ కోరారు. ఈ నెల 2 నుంచి పట్టణంలోని దుకాణాదారులు ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని, విక్రయాన్ని నిలిపివేయాలని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉత్వర్వులు జారీచేశారు. వాటిని పాటించని దుకాణాల్లో సోమవారం తనిఖీలు చేపట్టారు. స్థానిక గణేశ్ మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న దుకాణ దారులకు జరిమానా విధించారు.

PUBLIC NOTICE

This is to inform the general public that **Bojja Vidyasagar** is owner of Land admeasuring 138 sq.yds., in Survey No. 805, 806 situated at Aitipamula Village, Kattamguru Mandal, Nalgonda District who acquired the same vide Registered sale deed no. 3598/2023 dated 13-9-2023 The original link document Registered Sale Deed No. 778/2014 dated 21-5-2014 is lost.
Whosoever has found the above mentioned original document and whoever has got any claims or rights over the above mentioned property. Please contact J.Sivanesan, Advocate, Contact No. 9393099915 within 10 days from date of publication of this notice.

కట్టంగూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

దేవరకొండ రూరల్ : కొండభీమనపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

శాలిగౌరారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే వేముల వీరేశం

● పలు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కట్టంగూర్/చిట్యాల/నకిరేకల్,అక్టోబర్ 14 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. సోమవారం కట్టంగూర్‌లో, చిట్యాల, వెల్మినేడు గ్రామాల్లో, నకిరేకల్ పట్టణంలోని చీమలగడ్డలో, మండలంలోని తాటికల్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు తమ ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాల్లో విక్రయించి ఏ గ్రేడ్‌కు రూ.2320, బీ గ్రేడ్‌కు రూ.2300 మద్దతు ధర పొందాలని సూచించారు. కట్టంగూర్‌లో జరిగిన కార్యక్రమంలో తాసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగేశ్వర్‌రావు, మానిటరింగ్ అధికారి సుమానందం, జమాల్, పీఏసీఎస్ సీఈఓ బండ మల్లారెడ్డి, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, చిట్యాలలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీటీ దీపక్, పీఏసీఎస్ చైర్మన్లు సుంకరి మల్లేశ్‌గౌడ్, ఏనుగు రఘుమారెడ్డి, కనకదుర్గ దేవాలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు, నకిరేకల్‌లో తాసీల్దార్ ఎస్‌కే జమీరొద్దీన్, ఏఓ ఎండీ జానిమియా, పీఏసీఎస్ సీఈఓ జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసమే కేంద్రాలు

శాలిగౌరారం : రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం శాలిగౌరారం మార్కెట్ యార్డ్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తాళ్లూరి మురళి, మార్కెట్ కార్యదర్శి చీనానాయక్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, అన్నెబోయిన సుధాకర్, అల్లి సైదులు, నోముల జనార్దన్ పాల్గొన్నారు.

కొండభీమనపల్లిలో..

దేవరకొండరూరల్ : మండలంలోని కొండభీమనపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ శ్రీరాములు, ఎంపీడీఓ డానియల్, డీటీసీఎస్ హన్మంతు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటయ్య పాల్గొన్నారు.

మాటూరులో..

త్రిపురారం : మండలంలోని మాటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీఓ విజయకుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం అశోక్, సీసీలు దేవ్‌సింగ్, హేమానాయక్, నాయకులు పాల్గొన్నారు.

నిర్వాహకులు రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

● డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి

కొత్తపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, అక్టోబర్ 14: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కేంద్రం నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి, కుదావన్‌పూర్, నర్సింగ్‌భట్ల, తొరగల్, మేళ్లదుప్పలపల్లి, పెద్దసూరారం, చిన్నసూరారం, ఖాజీరామారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 365 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 67 కేంద్రాలు ప్రారంభించామని, వారం, పది రోజుల్లో మిగిలిన కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. తేమ 17 శాతం లోపు ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తితే తక్షణమే టోల్ ఫ్రీ నంబర్ 9963407064కు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఏపీఎం వినోద, ఏపీఓ స్ఫూర్తి, సీసీలు గీత, నరసింహ, అంజయ్య, శారద, ఎస్ ఆర్పీ నాగలక్ష్మి, మహిళా సంఘం అధ్యక్షురాలు కొప్పోల విజయలక్ష్మి పాల్గొన్నారు.

జీఎన్ఎం కోర్సులో చేరేందుకు దరఖాస్తులు

నీలగిరి, అక్టోబర్14: జీఎన్ఎం(జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ)లో చేరేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 17లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకనటలో సూచించారు. జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన శిక్షణ సంస్థలకు సంబంధించిన వివరాలకు ప్రిన్సిపాల్ జీఎన్ఎం కళాశాల లేదా డీఎంహెచ్ఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలను htpp://dme.telangana,gov.inలో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

స్పోర్ట్స్ కిట్లు అందజేత

మర్రిగూడ,అక్టోబర్ 14 : మండలంలోని మేటిచందాపురం గ్రామానికి చెందిన యువకులకు సోమవారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చెర్కు లింగంగౌడ్ క్రికెట్, వాలీబాల్ కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఐతగోని అశోక్ గౌడ్, నాయకులు గణేశ్ గౌడ్, ఎండీ.యాసిన్, రఫు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తిమృతి

తిప్పర్తి : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని మల్లేపల్లివారిగూడెం గ్రామానికి చెందిన కొత్తలింగయ్య(70) ఆదివారం రాత్రి మృతి చెందాడు. లింగయ్య సాయంత్రం గ్రామంలో రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. స్థానికులు చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. అతడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి పరామర్శ

కట్టంగూర్, అక్టోబర్ 14 : మండలంలోని గార్లబాయిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తేలు లింగయ్య కుమారుడు తేలు రాజశేఖర్ గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గ్రామానికి వెళ్లి రాజశేఖర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు, మాజీ సర్పంచ్ బోడ సరితాయాదగిరి, వడ్డె సైదిరెడ్డి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఒంగూరి సైదులు, కంచర్ల లింగారెడ్డి, రాఘవులు, తేలు నాగయ్య ఉన్నారు.

16న నిడమనూరు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

నిడమనూరు, అక్టోబర్ 14 : నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కొత్త పాలకవర్గం ఈ నెల 16న ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రంలోని బాలాజీ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్లో జరిగే కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి హాజరు కానున్నారు. చైర్మన్ అంకతి సత్యం, వైస్ చైర్మన్ బుసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు యడవల్లి రంగశాయిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని చైర్మన్ అంకతి సత్యం ఒక ప్రకటనలో కోరారు.

పాము కాటుతో రైతు మృతి

మాడ్గులపల్లి, అక్టోబర్ 14: పాము కాటుతో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని ఇందుగుల గ్రామ శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం చిలారమీదిగూడెం గ్రామానికి చెందిన గుడిపల్లి లింగారెడ్డి(60) ఆదివారం సాయంత్రం ఇందుగుల గ్రామ శివారులోని తన పొలం వద్దకు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా పాముకాటుకు గురై మృతిచెందినట్లు గుర్తించారు. లింగారెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

నేటి నుంచి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

త్రిపురారం, అక్టోబర్ 14: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14 వరకు పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేయనున్నట్లు త్రిపురారం, నీలాయగూడెం పశువైద్యశాలల అధికారులు డాక్టర్ నరేందర్, డాక్టర్ శశికళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 21 వరకు త్రిపురారం, అంజనపల్లి, నీలాయగూడెం గ్రామాల్లో, 22 నుంచి 25 వరకు మాటూరు, కామారెడ్డిగూడెం, పెద్దదేవులపల్లిలో, 26 నుంచి 29 వరకు రాగడప, నర్లకంటిగూడెం, బెజ్జికల్, మర్రిగూడెంలో, 30 నుంచి నవంబర్ 1 వరకు పలుగుతండా, సత్యనారాయణపురం, గొల్లగూడెం, 2 నుంచి 6 వరకు బొర్రాయిపాలెం, కంపసాగర్, కోమటిగూడెం, కంపాలపల్లి, 7 నుంచి 11 వరకు అప్పలమ్మగూడెం, కొణతాలపల్లి, దుగ్గెలపల్లి, జి.అన్నారం, 12 నుంచి 14 వరకు డొంకతండా, బృందావనపురం, బాబుసాయిపేట గ్రామాల్లో టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. పశువుల పెంపకం దారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

దామరచర్ల నాగుల్ చెరువు భూముల సర్వే

భూములను సర్వే చేస్తున్న అధికారులు

దామరచర్ల, అక్టోబర్ 14: మండల కేంద్రంలోని నాగుల్ చెరువు భూమిని సోమవారం అధికారులు సర్వే చేశారు. లోకాయుక్త న్యాయమూర్తి ఆదేశాల మేరకు చెరువు భూమిని సర్వే చేస్తున్నట్లు తాసీల్దార్ జవహర్‌లాల్ తెలిపారు. చెరువు మొత్తం విస్తీర్ణం 90.26 ఎకరాలు కాగా ప్రస్తుతం 60 ఎకరాలు మాత్రమే మిగిలిందని, మిగతా చెరువు భూమి కబ్జాకు గురైందని, మొత్తం సర్వే చేసి హద్దులు కేటాయించాలనీ లోకాయుక్తలో కొందరు పిటిషన్ దాఖలు చేయడంతో సర్వేకు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ ఏడీ ఎన్. శ్రీనివాసులు, ఈఈ లక్ష్మణ్‌నాయక్, ఇరిగేషన్ డీఈ జనార్దన్, ఏఈ మాలూనాయక్ పాల్గొన్నారు. సర్వే నివేదికను కోర్టుకు సమర్పిస్తామని అధికారులు తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : సీఐ

బహుమతులు పొందిన విద్యార్థులతో సీఐ ఆంజనేయులు

హాలియా, అక్టోబర్ 14 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సీఐ అర్కపల్లి ఆంజనేయులు సూచించారు. దసరా పండుగ సందర్భంగా మండలంలోని పేరూరు గ్రామంలో నిర్వహించిన అండర్ 14 క్రీడా పోటీల్లో విజేతలకు సోమవారం ఆయన బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ శోభన్‌బాబు, నాయకులు రాయనబోయిన రాంబాబు, గోపనబోయిన రామలింగయ్య, పసుల పురుశోత్తం, బుడిగ పర్వతాలు, బైరు శ్రీకాంత్, యడవల్లి నాగరాజు, శంకర్, జి. రాజు, షేక్ మగ్బూల్, నాగసైదులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలివ్వాలి

● ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి గోవర్ధని

వేములపల్లి, అక్టోబర్ 14: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందించాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధని కోరారు. సోమవారం మండలంలోని మొల్కపట్నం గ్రామంలో నిర్వహించిన ఐద్వా మండల మహాసభలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీ మేరకు మహిళా భరోసా ద్వారా రూ.2500 ఇవ్వాలని, ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐద్వా మండలాధ్యక్షురాలిగా పొదిల లక్ష్మమ్మ, కార్యదర్శిగా అనిరెడ్డి మాధవిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆదిముళ్ల ఇందిరమ్మ, ఈరమ్మ, ఎలగబోయిన సరిత, పుట్టల సువర్ణ, మేకల నాగమ్మ, సైదమ్మ, మాణిక్యమ్మ, కలమ్మ, కళావతి, లింగమ్మ పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

చిట్యాల, అక్టోబర్ 14 : మండలంలోని వనిపాకలకు చెందిన మల్లెబోయిన నర్సింహ(45) సోమవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహ మద్యానికి బానిసయ్యాడు. అతడితో మద్యం మాన్పించేందుకు కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఇంటికి తీసుకొచ్చాక తిరిగి మద్యం సేవించడం మొదలు పెట్టాడు. దాంతో భార్య అతడిని వదిలేసి చిట్యాలలోని తన తల్లిగారింటికి వచ్చింది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నర్సింహ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి పరామర్శ


నర్సిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

చిట్యాల, అక్టోబర్ 14 : మండలంలోని వెల్మినేడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త పైళ్ల నర్సిరెడ్డి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోమవారం గ్రామానికి వెళ్లి నర్సిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దేవరపల్లి సత్తిరెడ్డి, శ్రీశైలం ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ జోలికి వస్తే సీఎం మార్పు ఖాయం

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ జి.చెన్నయ్య

సభలో పాల్గొన్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

నీలగిరి, అక్టోబర్ 14 : ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ జోలికి వస్తే రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు ఖాయమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ జి. చెన్నయ్య, కో చైర్మన్ బాలకిషన్ హెచ్చరించారు. సమితి ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర సోమవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. సమితి జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు ఆధ్వర్యంలో యాత్ర బృందానికి ఘనస్వాగతం పలికారు. బాస్కర్‌టాకీస్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం టీఎన్‌జీవోస్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ దళితుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి ప్రేమ ఉంటే రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలన్నారు. ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్ పాలసీనా లేక రేవంత్‌రెడ్డి సొంత ఎజెండానా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి రవి, చెరుకు రాంచందర్, మేక వెంకన్న, బూర్గుల వెంకటేశ్వర్లు, గోపాజు రమేశ్, మంచాల లింగస్వామి, శ్రీను, నల్లాల కనుకరాజు, తల్లమల్ల హుస్సేన్, చింతపల్లి బాలకృష్ణ, గోలి సైదులు, అద్దంకి రవి పాల్గొన్నారు.

17న నల్లగొండలో సీఎం కప్ టార్చ్ ర్యాలీ

● జిల్లా యువజన, క్రీడలశాఖ ఇన్‌చార్జి అధికారి విష్ణుమూర్తిగౌడ్

నల్లగొండ రూరల్, అక్టోబర్ 14: ఈ నెల 17న జిల్లా కేంద్రంలో సీఎం కప్ -2024 టార్చ్ ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడలశాఖ ఇన్‌చార్జి అధికారి విష్ణుమూర్తిగౌడ్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రొత్సహించేందుకు సీఎం కప్ -2024 పేరుతో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నదన్నారు. ఈ విషయమై క్రీడాకారులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీ నల్లగొండ సమీపంలోని మర్రిగూడ బైపాస్ రోడ్డు నుంచి గడియారం సెంటర్ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ర్యాలీలో క్రీడాకారులు, క్రీడ సంఘాలు, ఒలింపిక్ అసోసియేషన్, వ్యాయామ ఉపాధ్యాయులు, యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారి